

ఫలరాజుకు గడ్డుకాలం

ఉలవపాడు: ఉలవపాడు బంగినపల్లె మామిడిని పురుగుపోటు పీడిస్తోంది. కాయలపై మచ్చలు వచ్చాయి. దీంతో వ్యాపారం తగ్గే అవకాశం ఉంది. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు(10గ్రాములు)	- రూ.62,480
22 క్యారెట్లు ఆర్నమెంట్(గ్రా)	- రూ.5,581
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,748
నవర(8 గ్రా)	- రూ.45,984

గరిష్టం/కనిష్టం
36.3 /27.0

వాతావరణం

వాతావరణంలో తేమ 71 శాతం ఉంది. జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకటి రెండు చోట్ల పిడుగులు పడవచ్చు.



న్యూస్‌రీల్

జిల్లా కలెక్టర్‌గా హరినారాయణన్

- చక్రధర్‌బాబు బదిలీ



హరినారాయణన్



చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఏపీ జెన్‌కో ఎండీగా బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న హరినారాయణన్‌ను నెల్లూరు కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 2020 జూలై 16న కలెక్టర్‌గా నెల్లూరు వచ్చిన కేవీఎన్ చక్రధర్‌బాబు పాలనలో అందరినీ మెప్పించారు. రెండు సంవత్సరాల 8 నెలల 6 రోజుల పాలనలో తనదైన ముద్రవేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్



నోటీస్ బోర్డులో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నెల్లూరు(టౌన్): ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశం కోసం గురువారం నిర్వహించిన జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షను తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని గూడూరులో ఉన్న నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, కోవూరు సమీపంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించారు. జేఈఈ మెయిన్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 600 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. వాటర్ బాటిల్, వాచ్, ప్యాడ్, చేతి ఉంగరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు.

10న పెన్షన్ అదాలత్

నెల్లూరు(సెంట్రల్): పెన్షన్ అదాలత్‌ను ఈ నెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు వెబెక్స్ వేదికగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపీఎస్ సభ్యులు సమావేశంలో జాయిన్ కావడానికి వెబెక్స్ లింక్‌లో చేరాలని పేర్కొన్నారు.

పది పరీక్షలకు 400 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పరీక్షలకు గురువారం జిల్లావ్యాప్తంగా మొత్తం 400 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో 27,382 మంది విద్యార్థులకు గాను 26,982 మంది పరీక్షలకు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 172 సెంటర్లలో పరీక్షలు జరగగా 98.54 శాతం మంది పరీక్షలు రాశారు. ఆర్జేడీ మలోలా 2 పరీక్ష కేంద్రాలను, ఆర్జేడీ సాయి సుబ్బారావు 8, డీఈఓ గంగాభవాని 5 కేంద్రాలను తనిఖీలు చేయగా 60 కేంద్రాలను సిటింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

మైపాడు రోడ్డుకు రూ.48 కోట్లు

ఇందుకూరుపేట: మైపాడు, నెల్లూరు రోడ్డుకు మహర్దశ పట్టనుంది. రహదారిని విస్తరించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. నెల్లూరు నుంచి మైపాడు బీచ్ వరకు 19.7 కిలోమీటర్ల మేర రూ.48 కోట్ల సీఆర్ఐఎఫ్ (సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్) నిధులతో రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.

రామాయపట్నం పోర్టుకు సోమశిల నీరు

రామాయపట్నం పోర్టు పనులు వడివడిగా జరుగుతున్న క్రమంలో సోమశిల జలాశయం నుంచి పోర్టు అవసరాలకు నీటిని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే పోర్టుతోపాటు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన శిరిడి సాయి సోలార్ ప్యానల్స్ కంపెనీకి కూడా నీటి కేటాయింపులు చేసింది. ఈ రెండింటికీ సోమశిల నుంచే నీటిని సరఫరా చేసేందుకు తాజాగా నిర్ణయించారు. అయితే సోలార్ పరిశ్రమ ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉన్న నేపథ్యంలో తమకు ప్రత్యేకంగా నీటిని కేటాయించాలని పోర్టు ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

పోర్టు, సోలార్ పరిశ్రమకు నీరిచ్చేలా ప్రతిపాదన

- రెండింటికీ కలిపి 0.645 టీఎంసీల కేటాయింపు
- డిసెంబర్ కల్లా పోర్టు కార్యకలాపాలను ప్రారంభించే దిశగా అడుగులు
- పోర్టుకు ప్రత్యేకంగా నీరివ్వాలని ప్రతినిధుల విజ్ఞప్తి
- నేరుగా పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరాకు చర్చలు



వేగంగా జరుగుతున్న రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు

కందుకూరు: రామాయపట్నం పోర్టు కార్యాలయాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి సారించింది. పోర్టు పనుల్లో ఈ ఏడాది డిసెంబర్ కల్లా మొదటి దశ పనులు పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించాలనే కృతనిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పోర్టు కార్యకలాపాలు ప్రారంభమైతే అవసరమైన నీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు పోర్టుకు అవసరమైన నీటిని సోమశిల ప్రాజెక్టు నుంచి సరఫరా చేయాలని ప్రణాళిక రూపొందించింది. దీనితోపాటు రావూరు, చేవూరు ప్రాంతాల్లో ప్రతిపాదించిన భారీ పరిశ్రమ శిరిడిసాయి సోలార్ ప్యానల్స్ కంపెనీకి అవసరమైన నీటిని కేటాయిస్తూ జీఓ జారీ చేసింది.

వేగంగా సాగుతున్న పనులు

ప్రస్తుతం రామాయపట్నం పోర్టు పనులు వేగంగా సాగుతున్నాయి. మొదటి దశలో రూ.3,736 కోట్ల ఖర్చుతో నాలుగు బెర్తుల నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం రెండు సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ ఫీడర్‌ల నిర్మాణంతోపాటు బెర్తుల నిర్మాణానికి అవసరమైన పనులు చేస్తున్నారు. ఈ మొత్తం పనులను కూడా ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి పోర్టు కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పోర్టు కార్యకలాపాలు ప్రారంభమైతే పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పోర్టు కార్యకలాపాలకు అవసరమైన నీటిని కేటాయించింది. దీనికిగాను సోమశిల ప్రాజెక్టు నుంచి పోర్టుకు అవసరమైన నీటి కేటాయింపులు చేశారు. పోర్టు ప్రతినిధుల ప్రతిపాదన ప్రకారం రోజుకు 5 మిలియన్ లీటర్ల నీరు అవసరమవుతుంది. అయితే పోర్టుతోపాటు గుడ్లూరు మండలంలోని రావూరు, చేవూరు గ్రామాల పరిధిలో 4 వేల ఎకరాల్లో దాదాపు రూ.50 వేల కోట్ల అంచనాతో ప్రతిపాదించిన శిరిడీసాయి సోలార్ ప్యానల్ తయారీ పరిశ్రమకు కూడా నీటిని ప్రభుత్వం కేటాయించింది. అటు పోర్టు, ఇటు పరిశ్రమ అవసరాలకు కలిపి 0.645 టీఎంసీల నీటిని సోమశిల ప్రాజెక్టు నుంచి కేటాయిస్తూ జీఓ విడుదల చేసింది.

సోమశిల నుంచి నేరుగా..

కేటాయించిన నీటిని నేరుగా సోమశిల ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేయాలని ప్రతిపాదించారు. మొదట కావలి చెరువుకు నీటిని తీసుకొచ్చి అక్కడి నుంచి పోర్టు, పరిశ్రమకు నీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు. అయితే కావలి చెరువు కింద రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. ఈ పరిస్థితుల్లో సోమశిల నుంచే నేరుగా నీటిని సరఫరా చేసేందుకు తాజాగా నిర్ణయించారు. దీనికిగాను దాదాపు 150 కి.మీ. మేర పైప్‌లైన్ నిర్మించాల్సి ఉంటుందని అంచనా. అయితే ఈ పైప్‌లైన్‌ను ఏ ప్రాంతాల మీదుగా వేయాలనే అలైన్‌మెంట్‌పై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ఉన్నత స్థాయి చర్చలు

పోర్టుకు నీటి కేటాయింపులపై పోర్టు ప్రతినిధులు ఉన్నత స్థాయి చర్చలు చేస్తున్నారు. తమకు ప్రత్యేకంగా నీటి కేటాయింపులు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి కార్యకలాపాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తమకు నీరు అత్యవసరమని చెబుతున్నారు. సోలార్ పరిశ్రమ ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉన్న నేపథ్యంలో ఆ పరిశ్రమతో కలిసి నీటి కేటాయింపులు అంటే ఆలస్యమవుతుందని భావిస్తున్నారు. కావున తమకు ప్రత్యేకంగా రోజుకు 5 మిలియన్ లీటర్ల నీటిని కేటాయించాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు ఈ ప్రతిపాదనపై ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్న నేపథ్యంలో దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. తమకు ప్రత్యేకంగా నీటిని కేటాయించాలనే విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పోర్టు ప్రతినిధులు చెబుతున్నారు.

పోర్టుకు నీటిని కేటాయించాం

సోమశిల ప్రాజెక్టు నుంచి రామాయపట్నం పోర్టుకు నీటిని కేటాయించారు. 0.645 టీఎంసీ నీటిని కేటాయించారు. అయితే ఈ నీటిని ఎలా సరఫరా చేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రామాయపట్నం పోర్టు, పరిశ్రమల అవసరాలకు ఈ నీటిని కేటాయించారు. దీనిపై పూర్తి స్పష్టత ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

– వెంకటరమణారెడ్డి, ఎస్ఈ, సోమశిల

తమ్ముళ్లది తలోదారి

జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఉనికి కోల్పోయింది. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత నుంచి తమ్ముళ్లు తలోదారి అయ్యారు. గడిచిన నాలుగేళ్లుగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు సైతం ప్రజాక్షేత్రంలో తిరిగిన జాడ లేదు. సార్వత్రిక ఎన్నికలకు పట్టుమని ఏడాది కూడా లేదు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఇప్పటికీ అభ్యర్థి ఎవరనే విషయంపై స్పష్టత లేదు. మరోవైపు పార్టీలో తండ్రీకొడుకుల కోటరీలు తయారయ్యాయి. సీనియర్ల ప్రతిపాదనలను చంద్రబాబు ఆమోదించినా.. లోకేశ్ వ్యతిరేకిస్తుండడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.



- జిల్లాలో బాబు, లోకేశ్ కోటరీలు
- పెత్తనమంతా లోకేశ్‌దేనా..
- సీనియర్ల ప్రతిపాదనలకు విలువేదీ..
- 8 నియోజకవర్గాల్లోనూ పటిష్ట నాయకత్వం లేని పరిస్థితి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత జిల్లాలోని సర్వేపల్లి నుంచి కందుకూరు వరకు 8 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. ఆ తర్వాత నుంచి జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ, ఆత్మకూరు ఉప ఎన్నికలో కానీ, తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీకే భారీ మెజార్టీలు వచ్చాయి. ఏ ఎన్నికలు చూసినా వైఎస్సార్‌సీపీ అప్రతిహత విజయాలను కైవశం చేసుకోవడంతోపాటు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే చేరుతుండడంతో ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజాదరణ పెరిగింది.

సందిగ్ధంలో సీనియర్లు

వరుసగా ఓటమి పాలైన సీనియర్లకు ఈ దఫా టికెట్ లేదని టీడీపీ మహానాడులో లోకేశ్ బాహాటంగానే ప్రకటించారు. తాజాగా ఆయన చేస్తున్న పాదయాత్రలోనూ రాబోయే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పడంతో సీనియర్ మాజీ ఎమ్మెల్యేలు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. వీరికి చంద్రబాబుతో అత్యంత సాన్నిహిత్యం ఉన్నప్పటికీ వారి మాటలు చెల్లుబాటు కావడం లేదు. చంద్రబాబు మాటను లోకేశ్ సైతం వినడం లేదని ఇటీవల జిల్లాలో జరిగిన పరిణామాలను బట్టి అర్థమవుతోంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని, అతని సోదరుడు గిరిధర్‌రెడ్డిని పార్టీలోకి తీసుకోవద్దని ఆ నియోజకవర్గాన్ని కనిపెట్టుకుని ఉన్న అజీజ్ ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డితోపాటు సీనియర్లతో కలిసి వెళ్లి చంద్రబాబుకు చెప్పినా ఫలితం లేకపోయింది. సోమిరెడ్డికి చంద్రబాబు వద్ద పరపతి ఉన్నా.. లోకేశ్ మాటే చెల్లుబాటు కావడంతో చంద్రబాబు మౌనం వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అర్థమవుతోంది.

లోకేశ్ కోటరీకే ప్రాధాన్యం

జిల్లాలో కోటంరెడ్డి విషయంలో లోకేశ్ కోటరీకే ప్రాధాన్యం లభించింది. మాజీ మంత్రి నారాయణ ముఖ్యఅనుచరుడు అయిన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. కోటంరెడ్డి సోదరులను పార్టీలోకి తీసుకురావద్దని ఎంత మొర పెట్టుకున్నా.. నారాయణ, వేమిరెడ్డి కలిసి వీరిని పార్టీలోకి తీసుకువచ్చారు. ఇక రాబోయే సార్వత్రిక ఎన్నికలలోనూ వీరి పెత్తనం కొనసాగుతుందని భావిస్తున్నారు. జిల్లాలో టీడీపీ పరిస్థితి చూస్తే సిట్టింగ్ మాజీలకు ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపు అసాధ్యమనే పరిస్థితుల నేపథ్యంలో కొత్త ముఖాలకు గాలం వేస్తోంది. ఇదే సమయంలో ఇటీవల సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకుని వారికే టికెట్లు ఇవ్వాలనే ఆలోచనలో టీడీపీ ఉన్నట్లు తెలుస్తోంది.

నియోజకవర్గాల్లో వర్గపోరు

జిల్లాలోని సర్వేపల్లి మినహా ఏడు నియోజకవర్గాల్లో వర్గపోరు స్పష్టంగా కనిపిస్తోంది. నెల్లూరు సిటీ నుంచి గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన మాజీ మంత్రి నారాయణ మళ్లీ టికెట్ కోరుకుంటున్నారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇదే స్థానం నుంచి సీటు ఆశిస్తుండగా, ఈయనకు సినీ నటుడు బాలకృష్ణ అండ ఉంది. నారాయణ లోకేశ్ కోటరీగా ఉండడంతో కోటంరెడ్డికి టికెట్ లభించడం కష్టమేనని తెలుస్తోంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని పరిశీలిస్తే అజీజ్ ఈ నియోజకవర్గ ఇన్‌చార్జిగా, నెల్లూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు టికెట్ తనదేనని భావిస్తున్న అజీజ్‌కు కోటంరెడ్డి రాకతో చెక్ పడింది. కోవూరులో మూడు ముక్కలాట కొనసాగుతోంది. కావలిలో ఆ పార్టీకి బలమైన నేతే లేని పరిస్థితి. ఉదయగిరిలోనూ అదే పరిస్థితి. తాజాగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి టికెట్ ఇస్తారనే ప్రచారంతో టీడీపీ శ్రేణులు ఉడికిపోతున్నాయి. కందుకూరులోనూ రెండు వర్గాలు కుమ్ములాడుకుంటున్నాయి. ఆత్మకూరులోనూ ముగ్గురు మాజీలతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నబాబు వర్గం ఉంది. తాజాగా ఆనం ఇక్కడ టీడీపీ తరఫున ఎంట్రీ ఇస్తారని ప్రచారం జరుగుతుండడంతో ఇక్కడా వర్గపోరు తప్పేటట్లు లేదు.

నేడు చంద్రబాబు రాక

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు శుక్రవారం నెల్లూరుకు రానున్నారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని 5 పార్లమెంట్, 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ముఖ్యనేతలతో పార్టీ పరిస్థితిపై సమీక్షించనున్నారు. నెల్లూరులోని వేణుగోపాలస్వామి కళాశాల ప్రాంగణంలో సమీక్ష సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమం ఏర్పాట్లలోనూ చంద్రబాబు కోటరీ లీడ్ తీసుకుంది. లోకేష్ కోటరీ మాత్రం ప్రస్తుతం దూరంగా ఉండడం విశేషం.

సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరిద్దాం



'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల తదితరులు

- మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల
- ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 'జగనన్నే మా భవిష్యత్తు'

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్రంలో అన్నివర్గాలకు అండగా ఉంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరిద్దామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో 'జగనన్నే మా భవిష్యత్తు' అనే నినాదంతో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే పోస్టర్‌ను నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి కాకాణి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజలకు వివరించేందుకే..

గత ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏ విధంగా మోసం చేశారనే విషయాన్ని తెలుపుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ అన్నివర్గాలకు ఏ విధంగా అండగా ఉంటున్నారో గుర్తుచేస్తామని మంత్రి తెలిపారు. ప్రధానంగా గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ఏవిధంగా ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందో తెలుపుతూ, ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్న విషయాన్ని వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహసారథులతోపాటు క్షేత్రస్థాయిలోని ప్రజాప్రతినిధుల నుంచి మంత్రి వరకు ప్రతి ఒక్కరూ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పబ్లిసిటీ కోసం ఆరాటం

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పబ్లిసిటీ స్టంట్ కోసం ఆరాట పడుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సెటైర్ వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తీరుపై మంత్రి కాకాణి మండిపడ్డారు. పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణం గురించి 'నాలుగేళ్లు కళ్లుమూసుకుని ఉన్నారా.. ఇంతవరకు ఈ సమస్యపై మాట్లాడకుండా.. ఇప్పుడు ఎందుకు తాపత్రయపడుతున్నారని' ప్రశ్నించారు. ఈ సమస్య ఇప్పుడే పుట్టినట్లు మాట్లాడుతూ ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై నెపం వేయాలని చూడడం సిగ్గుచేటున్నారు.

జలదీక్ష పేరుతో కోటంరెడ్డి హైడ్రామా!

- పబ్లిసిటీ కోసం హడావుడి
- పోలీసుల అనుమతి లేకున్నా దీక్ష పేరుతో నాటకం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తొమ్మిదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల ఆయన అధికార పార్టీకి దూరమయ్యారు. ఇప్పుడు సమస్యల పరిష్కారం కోసం అంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పోరాటం చేయడం వెనుక తన రాజకీయ అవసరాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. వాస్తవానికి జిల్లాలో టీడీపీ హయాంలో అటకెక్కిన అనేక పనులు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక శరవేగంగా జరుగుతున్నాయి. ఏ నియోజకవర్గంలోనూ మంజూరైన ఏ పని కూడా పెండింగ్‌లో ఉన్న దాఖలాలు లేవు. ప్రత్యేకించి నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

సీఎం ఆమోదించినా..

గతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చినపుడు వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన వినతికి సీఎం ఆమోదం తెలిపారు. ఆపై వంతెన నిర్మాణానికి సంబంధిత ఇంజినీరింగ్ శాఖ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉన్నా అవేమీ పట్టించుకోకుండా.. ప్రస్తుతం పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో అభివృద్ధి పనులంటూ దీక్షల పేరుతో డ్రామా చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి



మాగుంట లేఅవుట్‌లోని తన నివాసం వద్ద మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పోలీస్ శాఖ అనుమతి లేకున్నా..

పొట్టేపాళెం కలుజు వద్ద జలదీక్షకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి పోలీస్ శాఖ అనుమతి ఇవ్వలేదు. ఆ రహదారి చిన్నది కావడంతో రాకపోకలు స్తంభించే అవకాశం ఉంది. దీంతోపాటు వందలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారి కావడం.. మరోవైపు పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ స్తంభిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడతారని పోలీస్ శాఖ అనుమతి ఇవ్వలేదు. కానీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాత్రం తాను జలదీక్ష చేసి తీరుతానంటూ హడావుడి చేశారు. గురువారం పోలీసులు దీక్షకు అడ్డుచెప్పడంతో తన అనుచరులతో కలిసి ఇంటి ముందే బైఠాయించి పది నిమిషాలు మీడియాతో మాట్లాడి వెళ్లి తన కార్యాలయంలో కూర్చున్నారు.

చంద్రబాబు దృష్టిలో పడేందుకే..

కోటంరెడ్డి చేరికను టీడీపీలో చంద్రబాబు కోటరీ అడ్డుకుంటోంది. దీంతో చంద్రబాబు దృష్టిలో పడేందుకు జలదీక్ష పేరుతో డ్రామాకు తెరదీశాడని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తొమ్మిదేళ్లు గుర్తుకు రాని నెల్లూరు రూరల్ సమస్యలన్నీ ఇప్పుడే గుర్తుకు వచ్చినట్లుగా అవి వెనువెంటనే మంజూరు చేయించాలని జలదీక్షకు దిగే ప్రయత్నం చేయడం డ్రామాను తలపిస్తోంది. చంద్రబాబు రాకకు ఒకరోజు ముందే ఈ హైడ్రామా నడిపించారని విమర్శలొస్తున్నాయి. ఇంత చేసినా టీడీపీ కేడర్ శ్రీధర్‌రెడ్డి వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో పరువు పోతుందని భావించి ఇతర రాజకీయ పక్షాలను పిలిపించుకుని వారి మద్దతు ఉన్నట్లు చెప్పుకునే ప్రయత్నం చేశారని అంటున్నారు.

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

- డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య
- నేడు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఏసీ స్టేడియం వరకు అవగాహన ర్యాలీ

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యంపై ప్రజలందరికీ అవగాహన తప్పనిసరి అని, తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సంతపేటలోని తన చాంబర్‌లో ఆయన డాక్టర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉన్న జబ్బులకు తోడు రోజురోజుకూ సమాజంలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి సమస్యలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు 1948 ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ వరల్డ్ హెల్త్ డేను ప్రకటించిందన్నారు. అప్పటి నుంచి ప్రజారోగ్యంపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిందని తెలిపారు. అందులో భాగంగా వైద్యశాఖ, ఐ3 సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఏసీ స్టేడియం వరకు నర్సింగ్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, అధికారులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని, ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసుకునే బదులు ప్రభుత్వాస్పత్రికి వచ్చి ఉచిత వైద్యసేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్, డెమో అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య తదితరులు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 100
లేయర్ (లైవ్) : 75
బ్రాయిలర్ చికెన్ : 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 200
లేయర్ చికెన్ : 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.80
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40



ఫలరాజుకు గడ్డుకాలం

- కాయల్లో పురుగుల చేరిక
- పండుఈగ తాకిడే కారణం
- సలహాలు ఇస్తున్న ఉద్యాన శాఖ

ఉలవపాడు : ఉలవపాడు బంగినపల్లె మామిడిని పురుగుపోటు పట్టి పీడిస్తోంది. వేసవి వచ్చిందంటే ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, తమిళనాడు, కర్నాటక ప్రజలు ఉలవపాడు మామిడి కోసం ఎదురు చూస్తుంటారు. ఎన్నడూ లేనివిధంగా గతేడాది ఉలవపాడు మామిడిలో పురుగులు వచ్చాయి. దీనికి కారణం పండుఈగ అని గుర్తించి వాటి నివారణ కోసం ఈ ఏడాది రైతులు పలు మందులను పిచికారీ చేశారు. అయినా ఈ ఏడాది కూడా పండుఈగ ఉలవపాడు ప్రాంతంలోని తోటల్లోకి చేరి కాయల్లో వస్తున్నాయి. దీంతో నల్లటి మచ్చలు ఏర్పడి పురుగులు వస్తున్నాయి.

రైతులకు గడ్డు కాలం

ఉలవపాడు ఉద్యాన శాఖ పరిధిలో సుమారు పది వేల ఎకరాల్లో మామిడిసాగు జరుగుతోంది. కందుకూరు డివిజన్ పరిధిలో ఐదు వేల ఎకరాల్లో సాగవుతోంది. ప్రతి ఏడాది ఎకరాకు 2 నుంచి 3 టన్నుల వరకు కాయల దిగుబడి వస్తోంది. టన్ను 20 నుంచి 40 వేల వరకు పలుకుతోంది. అంటే సుమారు 90 కోట్లపైనే వ్యాపారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో గతేడాది నుంచి కాయల నాణ్యత సక్రమంగా లేని కారణంగా ఈసారి కూడా వ్యాపారం తగ్గే పరిస్థితి నెలకొంది.



కాయలకు కవర్లు కడుతున్న రైతులు



దెబ్బతిన్న మామిడిపండు

రైతులు చేయాల్సింది

ఈ పండుఈగ నివారణకు ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు. రైతులు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలి. దీని వల్ల మగ పండుఈగలు బుట్టలోకి చేరుతాయి. దీని వలన కొంత మేర ఉధృతి తగ్గే అవకాశం ఉంది. పండుఈగ కాయలకు తగలకుండా ఉండాలంటే ప్రతి కాయకు కవర్ కట్టాలి. దీని వల్ల కాయల రంగు కూడా బంగారు రంగులో వస్తాయి. ఈ కవర్ ఒకటి రూ.4 పడుతుంది.

పురుగులు వస్తున్నాయి



గతేడాది నుంచే మా ప్రాంతంలో కాయల్లో పురుగులు వస్తున్నాయి. ఈ ఏడాది తోటల్లో మందులు కూడా భారీగా పిచికారీ చేశాం. అయినా పచ్చికాయలకు నల్లటి మచ్చగా ఏర్పడి లోపల పురుగులు ఏర్పడుతున్నాయి.

– సంకూరి మాచెర్ల రావు, మామిడి రైతు, ఉలవపాడు

సలహాలు ఇస్తున్నాం



మామిడి తోటల్లో పండుఈగ నివారణకు శాస్త్రవేత్తల సహాయంతో రైతులకు సలహాలు ఇస్తున్నాం. తోటలను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలను తెలియజేస్తున్నాం. శాస్త్రవేత్తలను తీసుకొచ్చి నివారణ చర్యలు చేపడుతున్నాం.

– జ్యోతి, ఉద్యాన శాఖాధికారి, ఉలవపాడు

మత్స్యకారులకు భరోసా ఇస్తున్నాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట) : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మత్స్యకారులకు ఆర్థిక భరోసా ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. గాడిదలకు ఏమి తెలుసు గంధపు వాసన అన్న చందాన టీడీపీ నేతలు చేపల విక్రయాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడాన్ని ఆయన తప్పుపట్టారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కూర్మనాథ్‌తో కలిసి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు గురువారం మంత్రి కాకాణి వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల మనోభావాలు దెబ్బతినే విధంగా టీడీపీ నేతలు గతంలో మాట్లాడారని గుర్తుచేశారు. మత్స్యకారులకు అన్నివిధాలా ప్రభుత్వం అండగా ఉందన్నారు. ప్రజలకు పౌష్టికాహారం అందించడంతో పాటు మత్స్యకారులకు ఉపాధి మార్గాలు సులభతరం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మినీ ఫిష్ అవుట్‌లెట్ల ఏర్పాటు, మత్స్య సంపదను మార్కెటింగ్ చేయడానికి మత్స్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మత్స్య సంపద తరలింపు, విక్రయానికి వీలుగా ప్రస్తుతం అందజేస్తున్న వాహనాలు ఉపయోగపడుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం సబ్సిడితో, బీసీలకు 40 శాతం సబ్సిడీతో వాహనాలు అందజేస్తారన్నారు. అంతక ముందు 18 ద్విచక్ర వాహనాలు, మూడు లైవ్ ఫిష్ వెండింగ్ వాహనాలను మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జేడీ నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, ఏడీ ప్రసాద్ పాల్గొన్నారు.



మత్స్యకార వాహనాలను ప్రారంభించిన మంత్రి కాకాణి, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, జేసీ కూర్మనాథ్

యువతి ఆత్మహత్య

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కళ్లగుంట పెంచల నీలిమాదేవి (23) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఎం.శివశంకర్‌రావు వివరాల మేరకు.. వెంకట్రావుపల్లికి చెందిన ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి కుమార్తె పెంచల నీలిమాదేవి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తూ ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో తండ్రి తన మిత్రుల పిల్లలు డాక్టర్లుగా పనిచేస్తుంటే నువ్వు మాత్రం సాఫ్ట్‌వేర్ రంగంలోకి ఎందుకు వెళ్లావంటూ నిందించడంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం అర్ధరాత్రి మేడపై ఉరి వేసుకుంది. బంధువులు ఆలస్యంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురువారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- ఆర్జేడీ సుబ్బారావు

గుడ్లూరు : పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని గుంటూరు ఆర్జేడీ సుబ్బారావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చైతన్య పాఠశాలల్లోని రెండు కేంద్రాల్లో జరుగుతున్న పది పరీక్షల సరళిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు కేంద్రాల్లో హిందీ పరీక్ష జరుగుతున్న ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. పోలీస్ సిబ్బంది కూడా బాగా సహకరిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టమెంట్ ఆఫీసర్లకు సూచనలు చేశారు. ఆయన వెంట రెండు కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు జాన్, వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రసాదరెడ్డి ఉన్నారు. అలాగే ఉలవపాడులో పరీక్షలు జరుగుతున్న ఐదు కేంద్రాలను పరిశీలించినట్లు ఆర్జేడీ తెలిపారు.

పట్టాలపై నలిగిన ప్రాణాలు

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో రైలు కింద పడి గురువారం ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. నెల్లూరు నగర పరిధిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడగా, కావలి పరిధిలో ఇద్దరు మహిళలు రైలు కింద పడి మరణించారు.

నెల్లూరు సిటీ : వెంకటాచలం- వేదాయపాళెం రైల్వేస్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మృతుడి వయసు 40 ఏళ్లు ఉండొచ్చని, ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని మృతదేహం

గుర్తుతెలియని మహిళ..

కావలి రూరల్ : పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ రైల్వే గేట్ సమీపంలో గుర్తుతెలియని మహిళ రైలు కింద పడి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై టి.అరుణ తెలిపిన వివరాల మేరకు.. సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన మహిళ రైలు కింద పడి మృత్యువాత పడింది. ఘటనా స్థలంలో మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆమె ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలియజేశారు.



మహిళ మృతదేహం

రైల్లో నుంచి జారిపడి..


కావలి రూరల్ : గుర్తుతెలియని మహిళ రైల్లో నుంచి జారిపడి మృతిచెందిన ఘటన కావలి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై టి.అరుణ తెలిపిన వివరాల మేరకు.. రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీచైతన్య కళాశాల వద్ద సుమారు 40–45 ఏళ్ల వయసు కలిగిన గుర్తుతెలియని మహిళ రైల్లో నుంచి జారిపడింది. ఘటనా స్థలంలోనే మరణించింది. మృతురాలి వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహిళ మృతదేహం

కారు ఢీకొని రైతు దుర్మరణం

పొదలకూరు : రోడ్డు పక్కన ధాన్యాన్ని లారీకి లోడు చేస్తుండగా పక్కన నిల్చుని ఉన్న రైతును గుర్తుతెలియని కారు ఢీకొనడంతో ఆయన మృతిచెందిన చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. దీనిపై ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై ఎస్కే కరిముల్లా గురువారం కేసు నమోదు చేశారు. మనుబోలు మండలం మడమనూరుకు చెందిన పిడూరు వెంకటరమణారెడ్డి(55) బుధవారం మధ్యాహ్నం బ్రాహ్మణపల్లి రోడ్డుపక్కన ధాన్యం లోడు చేస్తున్న ప్రాంతంలో నిలబడి ఉండగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఆయన్ను ఢీకొని వెళ్లిపోయింది. వెంటనే క్షతగాత్రుడిని పొదలకూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే రైతు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుమారుడు వసంతకుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటరమణారెడ్డి మృతదేహం

బైక్‌పై వెంబడించి కత్తితో దాడి

- ఇద్దరికి గాయాలు

అల్లూరు : బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి కొందరు వెంబడించి కత్తులతో దాడి చేయగా ఇద్దరికి గాయాలైన ఘటన అల్లూరు నగరపంచాయతీ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అల్లూరు పాత బస్టాండ్ వద్ద తిప్ప గ్రామానికి చెందిన మల్లి శివాజీ అనే వ్యక్తికి అల్లూరు హరిజనవాడకు చెందిన కొందరు వ్యక్తులతో గత సోమవారం సాయంత్రం తోపులాట జరిగింది. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న శివాజీ అల్లూరుకు చెందిన చక్రవర్తి, పర్యాని కార్తీక్, అనగాని సుబ్బు, సాయితో కలిసి బుధవారం రాత్రి అల్లూరు హరిజనవాడకు చెందిన చింటు, ప్రణయ్ బైక్‌పై వెళ్తుండగా వెనుక వైపు నుంచి కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో చింటు, ప్రణయ్‌లకు రక్త గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి మల్లి శివాజీ, చక్రవర్తి, కార్తీక్, సుబ్బు, సాయిల మీద పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

ఓపెన్ పరీక్షలకు 101 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్) : జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలకు 101 మంది అభ్యాసకులు గైర్హాజరయ్యారు. ఎస్ఎస్‌సీకి సంబంధించి మొత్తం ఆరు సెంటర్లలో పది మంది అభ్యాసకులు హాజరు కావాల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. ఇంటర్‌కు సంబంధించి మొత్తం 1,561 మంది హాజరు కావాల్సి ఉండగా 1,461 మంది హాజరై, 100 మంది గైర్హాజరయ్యారు.

మా దృష్టికి వస్తే చర్యలు

నెల్లూరు (టౌన్) : ఏపీ ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగినట్లు మా దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని డీఈఓ గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో 22 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు చెప్పారు.

కోర్టుల్లో సదుపాయాలు ఎలా ఉన్నాయి

- ఎంపీ బీద మస్తాన్‌రావు

నెల్లూరు(సెంట్రల్) : దేశంలోని కోర్టుల్లో మౌలిక సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయని రాజ్యసభలో ఎంపీ బీద మస్తాన్‌రావు గురువారం ప్రశ్నించారు. స్పందించిన కేంద్ర న్యాయ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సమాధానమిస్తూ న్యాయ వ్యవస్థ కోసం మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసే ప్రాథమిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే అని, కాగా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు.